

సారా నిర్మూలనే లక్ష్యం

- నూతన బార్ పాలసీని పూర్తి చేయండి
- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నవోదయం-2 ప్రక్రియలో సారా నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి సిబ్బందికి పిలుపునిచ్చారు. మంగళవారం తన ఛాంబర్లో నంద్యాల, కర్నూలు జిల్లాల సీఐలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాల్లో నాటుసారా నిర్మూలనపై చర్యలు తీసుకోవాలన్నారు. సారా మానేసిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో మొదటి విడత అనుమతులు పొందిన 37 బార్లకు వారి చేత రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ కట్టించి బార్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తులు రాకుండా మిగిలిపోయిన 9బార్లకు నోటిఫికేషన్‌వచ్చినందున ఈనెల 14 లోపు దరఖాస్తులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా నిరంతరం దాడులు కొనసాగించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో అసిస్టెంట్ కమిషనర్ వి.హనుమంతరావు, సూపరింటెండెంట్లు ఎం.సుధీర్ బాబు, రవికుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు రాజశేఖర్ గౌడ్, రామకృష్ణారెడ్డి, వి.రాముడు, సీఐలు పాల్గొన్నారు.

నేపాల్‌లో ఉన్న జిల్లావాసుల సమాచారమివ్వండి

కలెక్టర్ రాజకుమారి



నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లావాసులు నేపాల్‌లో ఉన్నట్లయితే వారి కుటుంబ సభ్యులు కాని, బంధువులు కాని సమాచారం ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి కోరారు. నేపాల్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా జిల్లా వాసులు ఉన్నట్లయితే వెంటనే కమాండ్ కంట్రోల్ నంబర్ 08514-293903కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు. వారి సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారిని తమ సొంత ప్రాంతాలకు సురక్షితంగా చేర్చుతామన్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు శిక్షణ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జేసీ విష్ణుచరణ్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో బుధవారం జేసీ విష్ణుచరణ్ స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ఆసక్తి కల్గిన రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి కల్పించే దిశగా కోర్సులను గుర్తించాలన్నారు. జిల్లాలోని పెద్ద పరిశ్రమలను సంప్రదించి వాటిలో ఉద్యోగావకాశాలు కల్పించేవిధంగా యువతకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లాకు కేటాయించిన టార్గెట్‌లను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రీన్‌కో దాష్టీకం



పొలాలకు వెళ్లేందుకు రస్తా లేకుండా ఏర్పాటు చేసిన కంచెను చూపుతున్న రైతులు

గ్రీన్‌కో సోలార్ కంపెనీ అధికారుల దాష్టీకం పెరిగిపోతుంది. రైతుల పట్ల అరాచకంగా ప్రవర్తిస్తున్నారు. అనుమతుల్లేకుండా పట్టా భూముల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రశ్నించిన రైతులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నారు. గ్రామంలో పెద్ద కంపెనీ వస్తే యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపడుతాయనుకుంటే ఇలా రౌడీషీటర్లుగా మారుస్తారని అనుకోలేదని పలువురు గ్రామస్థులు పేర్కొంటున్నారు. సోలార్ పనుల వల్ల తమ పట్టా పొలాలకు వెళ్లు రోడ్లు, నీటికుంటలు, పొలాల గెట్లు తొలగించడంతో తమకు అన్యాయం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ భూమిలో సోలార్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేసుకోవాలని, ప్రైవేటు భూములు ఒక్క సెంటు కూడా గ్రీన్‌కో కంపెనీకి ఇవ్వమని రైతులు చెబుతున్నారు.

- అన్నదాతలపై అరాచకం
- పట్టా భూముల్లో విద్యుత్ స్తంభాలు
- రౌడీషీట్ ఓపెన్ చేయిస్తామని బెదిరింపులు
- ప్రైవేటు భూమిని ఒక్కసెంటు కూడా ఇవ్వం : రైతులు
- న్యాయం కోసం కోర్టుకైనా వెళ్తాం: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

నందికొట్కూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిడ్తూరు మండలంలో నాగలూటి, పైపాలెం, మాసాపేట గ్రామాల పొలిమేరల్లో 1,200 ఎకరాల్లో గ్రీన్‌కో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో సోలార్ ప్లానెల్‌ల ఏర్పాటు జరుగుతోంది. మరోవైపు సరిహద్దులను ఏర్పాటుచేసున్నారు. ఈసరిహద్దుల్లో గ్రామస్థులకు చెందిన పట్టా భూములకు వెళ్లేందుకు రస్తాను ఏర్పాటుచేయకుండా కంచె వేస్తున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా ప్రైవేటు భూముల్లో విద్యుత్ సంభాల కోసం గుంతలు తవ్వుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారు.



కంచె ఏర్పాటు చేయడంతో ఇబ్బంది పడుతున్న రైతులు

రస్తాను ఏర్పాటుచేయాలి


రైతులు సాగు చేసుకుంటున్న భూములను రైతులకే వదిలేసి ఆపైన 10మీటర్ల మేర రస్తాను ఏర్పాటుచేయాలి. ప్రైవేట్ భూముల్లో పోల్స్ ఏర్పాటుచేసినందుకు రైతులతో చర్చించి నష్టపరిహారం చెల్లించాలి.

- శివమూర్తి, గ్రామస్థుడు, పైపాలెం

బెదిరింపులకు గురిచేస్తే ఊరుకోం

గ్రీన్‌కో అధికారులు రైతులను బెదిరింపులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మానపాటి శ్రీనివాసగౌడ అన్నారు. సోలార్ ప్లాంట్ వస్తే యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయని భావిస్తే... గ్రామంలోని రైతులను బెదింపులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రశ్నించే రైతులను గ్రామం నుంచి వెళ్లగొడతాం? మీవెనుక ఎవరున్నారు? ఇలాంటి వ్యాఖ్యలతో హెచ్చరించడం భావ్యం కాదన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరిని ఒకతాటిపైకి తెచ్చి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. గ్రామ రైతులకు గ్రీన్‌కో కంపెనీ అధికారులు అన్యాయం చేస్తే కోర్టును ఆశ్రయించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

బెదిరిస్తున్నారు



నా పేరు మధుసూదన్‌రెడ్డి. నా పట్టా భూమిలో విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేసేందుకు గుంతలు తవ్వారు. ఇదేమిటని గ్రీన్‌కంపెనీకి చెందిన ఓ అధికారిని ప్రశ్నించా. మా ఇష్టం ప్రశ్నిస్తే నిన్ను ఊరు నుంచి వెళ్లగొడతామని బెదిరించాడు.

అరాచకం చేస్తున్నారు



మొదట ప్రభుత్వం మాకు ఇచ్చిన మా పొలంలోనే ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటామన్నారు. ఇప్పుడే మో రైతులు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పొలాల్లో కంచె వేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే రౌడీషీటర్లుగా కేసు నమోదు చేస్తూ ఎన్నో అరాచకాలు గ్రీన్‌కో అధికారులు చేస్తున్నారు.

- స్వామన్న, గ్రామస్థుడు, పైపాలెం

కుంటను పూడ్చేస్తుంది



ఒక్క పైపాలెం గ్రామంలో 4వేల గొర్రెలున్నాయి. వాటిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. గొర్రెలు నీళ్లు తాగడానికి ఉన్న కుంటలను సోలార్ కంపెనీ పూడ్చేస్తుంది. చెరువులకు వెళ్లి గొర్రెలు, పశువులు నీళ్లు తాగేందుకు రోడ్డు వేయాలి. లేదంటే గొర్రెలకు నీళ్లు లేక భవిష్యత్తులో జీవాలను అమ్ముకోవడం తప్పా మరే దిక్కు కనిపించడం లేదు.

- నరేష్, గొర్రెల కాపరి, పైపాలెం

పొలంలో గుంతలు తవ్వారు



నాకు ఉండేది ఈ రెండెకరాల భూమి ఉంది. ఈ పొలంపై ఆధారపడి జీవిస్తున్నా. వారం రోజుల క్రితం మధ్యాహ్నం వరకు పొలంలోనే ఉన్నాను ఇంటికి వెళ్లగానే సాయంత్రం పెద్దపెద్ద మిషన్లు వచ్చి గుంతలు తీశారు. ఎందుకు గుంతలు తీస్తున్నారని ప్రశ్నిస్తే గ్రీన్‌కో అధికారులు మీకు డబ్బులు ఇస్తాంలే అని చెబుతున్నారు.

- ఎల్లమ్మ, గ్రామస్థురాలు, పైపాలెం

1,076 పరిశ్రమలకు అనుమతులు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు 1,076 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్లు జేసీ విష్ణుచరణ్ వెల్లడించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో బుధవారం జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో మూడు నెలల కాలంలో వివిధ పరిశ్రమల స్థాపన కోసం 1,094 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 1,076 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామన్నారు. మిగిలిన 17 దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించి అనుమతులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్, సేల్‌ట్యాక్స్ తదితరాలలో రాయితీ కింద జిల్లాలో ఉత్పాదన సేవా రంగాల్లోని 20 యూనిట్‌లకు మొత్తం రూ.350.48లక్షల రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మహబూబ్ బాషా, ఎల్‌డీఎం రవీంద్రకుమార్, డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో ఘోరం

- గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ
- 20 గొర్రెలతోపాటు ఇద్దరు కాపరులు మృతి
- మృతులు నంద్యాల జిల్లా రుద్రవరం వాసులు

7

పోటెత్తిన ఉల్లి


- కర్నూలు యార్డుకు 14,542 క్వింటాళ్లు
- వ్యాపారుల ధర క్వింటానికి రూ.507లు మాత్రమే



కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి నిల్వలు

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డుకు బుధవారం ఉల్లి పోటెత్తింది. 14,542 క్వింటాళ్లను ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి రైతులు అమ్మకానికి తెచ్చారు. వ్యాపారులు మాత్రం క్వింటం ఉల్లికి కనీస ధర రూ.201 నుంచి రూ.507లు మాత్రమే చెల్లిస్తున్నారు. కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి, మార్క్‌ఫెడ్ డీఎం రాజు వ్యాపారులు రైతులకు ఇచ్చిన ధరను పోగా మిగిలిన ధరను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కడప నుంచి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రీజనల్ మేనేజర్ నాగరాజు కర్నూలు చేరుకుని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లిని తమ శాఖ పరిధిలోని గోదాముల్లో నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టారు. రైతులు తెచ్చిన ఉల్లిని త్వరగా కొనుగోలు చేయించడంతో పాటు ఆ ఉల్లిని బయటి ప్రాంతాలకు తరలించేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేశారు. వ్యాపారుల అమ్మకాలపై నిఘా పెట్టేందుకు కలెక్టర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయకుంటే ప్రభుత్వానికి నష్టం వాటిల్లే అవకాశముంది.

బన్ని ఉత్సవాలకు ముహూర్తం ఖరారు



హొళగుంద, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాలకు ముహూర్తం ఖరారైంది. అక్టోబరు 27 నుంచి నవంబరు 6వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు బుధవారం వెల్లడించారు. సెప్టెంబరు 27న కంకణధారణ, అక్టోబరు 2న కల్యాణోత్సవం, అదేరోజు అర్ధరాత్రి బన్ని ఉత్సవాలు, 3న తెల్లవారు జామున దైవకార్ణికం, 4న స్వామివారి రథోత్సవం, 5న గొరవయ్యల ఇనుప సంకెళ్ల తెంపుట, 6న స్వామి వారు నెరణికి చేకుకోవడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

సనాతన ధర్మం కోసం..

- భగవద్గీతపై దేశవ్యాప్త ప్రచారం
- ఏడోసారి పాదయాత్ర



పాదయాత్రలో శంఖం పూరిస్తున్న అర్చకుడు



వృషభంతో పాదయాత్రికుడు



పాదయాత్ర చేస్తున్న దృశ్యం



రుద్రవరంలో ప్రత్యేక అలంకరణలో ఎద్దులబండి

రుద్రవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సనాతనవేదిక ధర్మంపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఇస్కాన్ చేపట్టిన పాదయాత్ర బుధవారం రుద్రవరం మండలానికి చేరుకుంది. సనాతన ధర్మం కోసం ఎద్దుల బండితో చేపడుతున్న పాదయాత్ర ఇప్పటికే ఆరుసార్లు పూర్తిగా ప్రస్తుతం ఏడోసారి దేశవ్యాప్తంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఇస్కాన్ ప్రతినిధి ఆచార్యదాస్ పలు ఆసక్తికర విషయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. సనాతన హిందూ ధర్మం ఎంతో గొప్పదని, దాన్ని కాపాడేందుకు ప్రజల్లో చైతన్యం తెస్తూ తాము పాదయాత్రకు శ్రీకారం చుట్టామన్నారు. కేదార్‌నాథ్, బద్రినాథ్, ద్వారక, పూరి, శ్రీకూర్మం క్షేత్రాలను తిరిగామన్నారు. అక్కడి నుంచి మంగళగిరి, గుంటూరు, మార్కాపురం, గిద్దలూరు మీదుగా నంద్యాల, రుద్రవరం, అహోబిళం క్షేత్రానికి వెళ్తున్నామన్నారు. పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకమై హిందూ సంస్కృతిని తెలియజేస్తున్నామన్నారు. అహోబిళం తర్వాత తిరుపతి, రామేశ్వరం వరకు పాదయాత్ర సాగుతుందన్నారు. ప్రతి రోజూ ఎద్దులబండితో పాటు పది కిలోమీటర్లు యాత్ర కొనసాగుతుందన్నారు. 1984లో తొలిసారిగా ద్వారకలో మొదలైన ఈ యాత్ర ఆరుసార్లు పూర్తి చేసుకుందన్నారు. ఏడో యాత్ర 2021లో ప్రారంభించామన్నారు. ఇస్కాన్ ప్రతినిధులు మహారాష్ట్రకు చెందిన ఆచార్యదాస్, మోహన్ గోపాల్, భద్ర బలరామ్‌దాస్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అమలవి షైదాస్, తదితరులు సనాతన ధర్మంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇదిలా ఉండగా బుధవారం రుద్రవరం మండలంలోని సంతాన వేణు గోపాల స్వామి ఆలయంలో ఇస్కాన్ బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉరిమే ఉత్సాహం.. సభలో ఉల్లాసం.. స్త్రీ శక్తి..!



సూపర్ హిట్

చంద్రన్న ప్రభుత్వానికి జై కొట్టిన జనం



కింద చోటు లేదు.. అందుకే ఇంతెత్తుకు..!

అనంతపురం వేదికపై నవ్యాంధ్రప్రదేశ్ పండుగ చేసుకుంది. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు. మండే ఎండను లెక్కచేయకుండా చిందులు వేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సహా అందరి ప్రసంగాలను శ్రద్ధగా వింటూ.. హర్షధ్వానాలతో మద్దతు పలికారు. వేలాది వాహనాలు, తండోప తండాలుగా జనం వచ్చినా.. సభకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించారు.



సభలో కర్నూలు జిల్లా నేతలు





పవనిజం..

యువతరం ఉత్సాహం..

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. రైతన్నకు శాపం

● పొలాల్లోకి మళ్లిన నీళ్లు ● దెబ్బతిన్న పంటలు

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతుకు శాపంగా మారింది. రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పొలంలో నీళ్లు నిలిచాయని రైతు, లద్దగిరి సర్పంచ్ పట్టె హనుమంతు వాపోయాడు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 786లో సుమారు తనకు నాలుగెకరాల పొలం ఉందన్నారు. ఎగువన పొలాల నుంచి వచ్చే నీరు ముందుకు వెళ్లడానికి వీలుగా తన పొలం వెంట కాలువ తవ్వించుకున్నట్లు తెలిపారు. అయితే కోడుమూ రు-వెల్దుర్తి రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ఇటీవల కాలువపై మట్టి వేయడంతో ఎగువ నుంచి వచ్చే నీరు పొలంలోకి మళ్లిందన్నారు. దీంతో పత్తి, కంది పంటలతో పాటు మామిడి, కొబ్బరి మొక్కలు దెబ్బ తింటున్నాయని ఆవేదన చెందారు. ఐదు రోజుల నుంచి మట్టిని తొలగించాలని కోరుతున్నా సిబ్బంది పెడచెవిన పెడుతున్నారని వాపోయాడు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



పొలంలో నీళ్లు చూపుతున్న లద్దగిరి సర్పంచ్ హనుమంతు



వెంకటగిరి వద్ద రోడ్డును అనుకుని మట్టికుప్ప

వెంకటగిరి వద్ద మట్టికుప్ప: వెంకటగిరి గ్రామం వద్ద రోడ్డు నిర్మాణ పనులకు వినియోగించే మట్టికుప్పను రోడ్డును అనుకుని పోశారు. రాత్రి సమయాల్లో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. భారీ వాహనాలు ఎదురైతే మాత్రం ఏదో ఒకటి ఆపుకోవాల్సి ఉంటుంది. నాలుగైదు రోజులుగా మట్టికుప్ప అలాగే ఉందని స్థానికులు తెలపడం కొసమెరుపు.

విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలి

● మాజీ జేడీ లక్ష్మీనారాయణ



కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలని మాజీ జేడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం రవీంద్ర మహిళా ఇంజనీరింగ్, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇండెక్షన్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంజనీర్లుగా కాకుండా ఇంజనీరింగ్ నాయకులుగా ఎదగాలన్నారు. యువత సామాజిక మాధ్యమాల పట్ల అతిగా ఆకర్షితులై తమ జీవితాన్ని తిరో గమనం వైపు పయనిస్తున్నారన్నారు. పద్మశ్రీ మల్లేషన్, మాంజీలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తమ గురువు, పూర్వ భారత రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటలను గుర్తుచేశారు. మీరు చదివే కళాశాలలకు మీరే ముఖ్యఅతిథిగా రావడం, మీ సంతకం ఒక ఆటోగ్రాఫీలాగా, మీ తల్లిదండ్రులు మీగురించి గర్వపడేలా చేయాలన్న మాటలు గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ కేఈ శ్రీనివాసమూర్తి, డా.సి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపా ల్ డా.ఉషశ్రీ, డీన్ (అడ్మిన్) డాక్టర్ ఎం.గిరిధరకుమార్, డీన్(స్టూడెంట్ అసోసియేట్ ప్రొఫెసర్) జి.శశికుమార్, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

కృషీవలుడు చంద్ర

దెంత లాగుతున్న రైతు పేరు చాకలి చంద్ర. ఎర్రదొడ్డి స్వగ్రామం. ఇతడికి నాలుగెకరాల పొలం ఉంది. మొదట్లో చంద్ర సెంట్రింగ్ పని చేసేవాడు. కొన్నేళ్ల క్రితం ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆ ప్రమాదంలో దెబ్బతిన్న కుడిచేతిని తొలగించారు. సెంట్రింగ్ పనికి దూరమయ్యాడు. ఒక్కచేతితోనే వ్యవసాయ పనులు చేసుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలిచాడు. చంద్రకు తల్లితో పాటు భార్య, ఐదుగురు సంతానం ఉన్నారు. నలుగురు కూతుళ్లలో ఇద్దరికి వివాహం జరిపించాడు. బుధవారం కొడుకు రవితో కలిసి బెండ పంటలో దెంత లాగాడు. ఎద్దుల బాడుగకు రూ.2వేలు ఖర్చు అవుతుందని, పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవడానికి కష్టమైనా భరించినట్లు తెలిపాడు.



ఒంటిచేత్తో దెంత లాగుతున్న రైతు చంద్ర

● కోడుమూరు రూరల్ ఆంధ్రజ్యోతి

అభివృద్ధిని ఓర్చుకోలేకపోతున్న జగన్

ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడాది కాలంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఓర్చుకోలేకపోతున్నారని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేయడాన్ని సహించలేని జగన్ సరికొత్త నాటకాలకు తెరతీస్తున్నారన్నారు. బుధవారం ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ కర్నూలుకు చేరుకుని విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ సాధించాయని, అందుకే అనంతపురం జిల్లాలో జరిగిన బహిరంగ సభకు లక్షలాదిగా ప్రజలు తరలివచ్చాయన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నాటక రంగం పూర్తిగా నిర్వీర్యమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కళాకారులు, కవులు, రచయితలకు మళ్లీ జీవం పోస్తున్నారన్నారు. ధనార్జనే ధ్యేయంగా సాగిన ఆయన పాలన అంతా అవినీతిమయమైందని ఆరోపించారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో కళాకారుల సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాలను తీసుకొస్తున్నట్లు తెలిపారు. కళలు, నాటక రంగం అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ఎదుట పలు ప్రతిపాదనలు ఉంచినట్లు తెలిపారు. కళాకారుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కళాకారులు, వారి ప్రదర్శనలు, సంక్షేమానికి కోసం టీటీడీ, శ్రీశైలం, ఇంద్రకీలాద్రి వంటి దేవస్థానాల నుంచి ఆర్థికపరమైన సహాయాన్ని కోరుతామన్నారు. మైసూరు దసరా ఉత్సవాలను మించి ఉండేలా 'విజయవాడ ఉత్సవ్' నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు విజయవాడ ఉత్సవ్ పేరిట ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గుమ్మడి గోపాలకృష్ణ వెల్లడించారు. ఈ సమావేశంలో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు, నాటక దర్శకులు పత్తి ఓబులయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న గుమ్మడి గోపాలకృష్ణ

22 నుంచి దసరా సెలవులివ్వాలి : ఆప్టా

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు దసరా సెలవులను ఈ నెల 22వ తేదీ నుంచి ఇవ్వాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షులు ఏటీఎస్ గణపతిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ప్రకాష్‌రావు మంత్రి నారా లోకేశ్‌కు పాఠశాలల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 24వ తేదీ నుంచి దసరా సెలవులు ఇచ్చారని, దాన్ని మార్చి సెప్టెంబరు 22 నుంచి (మహలయ అమా వాస్య) అన్ని పాఠశాలలకు సెలవులను ప్రకటించాలని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా మహాలయ అమావాస్య నుంచి పాఠశాలలకు సెలవు లు ఇచ్చారని సూచించారు. హిందూ మనోభావాలను గౌరవించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణ కోసం ఇంటర్వ్యూలు



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీదేవి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా హెవీ మోటారు వాహనం ఉచిత డ్రైవింగ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కార్పొరేషన్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీదేవి ఆధ్వర్యంలో కర్నూలు డిపో-1 బీఎం సుధారాణి ఆధ్వర్యంలో జరిగాయి. కర్నూలు జిల్లాలో 18మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. ఇందులో 10మందిని ఎంపిక చేయాల్సి ఉంది. అలాగే నంద్యాల జిల్లాలో 14 దరఖాస్తులు వచ్చా యి. 12 మంది హాజరయ్యారు. ఇందులో పది మందిని ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను ఎస్సీ కార్పొరేషన్ ఏవో విజయలక్ష్మి, ఆర్టీసీ సుబ్రహ్మణ్యం, ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగులు, నంద్యాల జిల్లా అధికారులు పరిశీలించారు.

కర్నూలు ఖ్యాతిని పెంచండి

మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌తో సత్కారం అందుకున్న టీజీవీ కళాక్షేత్రం కళాకారులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కళలకు కాణాచిగా ఉన్న కర్నూలు జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ కళాకారులకు పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని సత్యసాయి సేవా సమితి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్, అమరావతి జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయి నాటక పోటీల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు 'జగదేక సుందరి సామా' చారిత్రక పద్య నాటకాన్ని ప్రదర్శించారు. ఇందులో ప్రథమ బహుమతితో పాటు నాలుగు వ్యక్తిగత అవార్డులు రావడంపై టీజీ వెంకటేశ్ బుధవారం కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సేవా సమితి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కళాకారులను ప్రోత్స హించే విధంగా నాటక పోటీలు ఏర్పాటుచేసి కళాకారులను ప్రోత్సహించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోం దని అన్నారు. ఈ బహుమతులు సాధించడంతో పాటూ భవిష్యత్తులో టీజీవీ కళాక్షేత్రానికి మరింత కీర్తిప్రతిష్టలు సాధించే దిశగా కళాకారులు ముందుకు పోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పి.రాజారత్నం, కేవీ రమణ, వాల్మీకి రాముడు, గాండ్ల లక్ష్మన్న, జీవీ శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, కె.బాలవెంకటేశ్వర్లు, లక్ష్మీకాంతరావు, గురుమూర్తి, బలరాం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టీజీవీ కళాక్షేత్రం కళాకారుల కృషి అభినందనీయమని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. జగదేక సుందరి సామా చారిత్రక పద్య నాటకం కళాకారులను ఆయన బుధవారం అభినందించారు.

ట్రాఫికర్

● కేసీ కెనాల్ వద్ద నిమజ్జనానికి తొలగించిన డివైడర్లు

● తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో తలెత్తిన సమస్య



వినాయకఘాట్ వద్ద అస్తవ్యస్తంగా వస్తున్న వాహనాలు

కల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని వినాయక ఘాట్ కేసీ కెనాల్ సమీపంలో ట్రాఫిక్‌జామ్‌తో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వారం రోజులుగా ఈప్రాంతంలో నిత్యం ట్రాఫిక్‌జామ్ వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటమే కాకుండా చిన్నపాటి ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. గాయత్రి ఎస్టేట్ నుంచి వినాయకఘాట్ దాటేందుకు కనీసం పది నిమిషాలు సమయం పడుతోంది. కలెక్టరేట్ నుంచి గాయత్రి ఎస్టేట్, దేవానగర్‌కు వెళ్లే వాహనాలతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 4న వినాయక నిమజ్జనం ఏర్పాట్లలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు వినాయకఘాట్ సమీపంలోని సిమెంట్ బారికేడ్లు(డివైడర్స్) తొలగించారు. నిమజ్జనంలో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. తొలగించిన డివైడర్లను యథాస్థానంలో ఏర్పాటు చేయకపోవడంతో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఇష్టానుసారంగా ప్రయాణిస్తున్నాయి. దీంతో రోడ్డు దాటేందుకు మహిళలు, వృద్ధులు చిన్నారులకు తిప్పలు తప్పడం లేదు. నిత్యం ఇదే రహదారిపై ప్రయాణిస్తున్న పోలీసులు చర్యలు తీసుకోక పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



మెరుగైన సేవలు అందించాలి

● విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం ఉమాపతి



డయల్ యువర్ ఎస్ఈలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎం.ఉమాపతి

కల్లూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆశాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి అధికారులను ఆదేశించారు. బుధవారం విద్యుత్‌శాఖ కార్యాలయంలో డయల్ యువర్ ఎస్ఈ నిర్వహించిన ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా 14 మంది ప్రజలు పలు సమస్యలపై ఎస్ఈకి ఫోన్‌లో సమస్యలు విన్నవించారు. ఈసందర్భంగా ఉమాపతి మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా లోవోల్టేజీ సమస్య ఉత్పన్నమైతే తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా విద్యుత్ సరఫరా అందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారు సూచించే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏడీఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

నేడు కర్నూలులో జిల్లా జట్ల ఎంపిక

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో కర్నూలు జిల్లా స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో అండర్-14, 17బాల, బాలికల జిల్లా జట్లను ఎంపిక చేస్తున్నట్లు నంద్యాల జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి బి.విశ్వనాథ్, జి.ఆశాజ్యోతిలు తెలిపారు. అండర్-14, 17 బాల, బాలికల విభాగాల్లో ఫుట్‌బాల్, ఉషూ, కరాష్ క్రీడల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్-17విభాగంలో ఉషూ జిల్లా బాల, బాలికల జట్లను ఎంపిక చేస్తామన్నారు.

డిప్యూటీ డైరెక్టర్‌గా నాగరత్నమ్మ



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.నాగరత్నమ్మ కడప రీజనల్ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ పద్మావతి ఏడీలకు సంబంధించి పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో కేఎంసీ ఏడీగా పని చేస్తున్న ఎం.నాగరత్నమ్మను డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ కడప కార్యాలయానికి బదిలీ చేశారు. దీంతో కర్నూలు మెడికల్ కాలేజీలో పరిపాలన విభాగంలో ఏవో పోస్టుతో పాటు ఏడీ పోస్టు ఖాళీగా ఏర్పడింది. డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన ఎం.నాగరత్నమ్మను కేఎంసీ ప్రిన్సిపాల్ వై.చిట్టినరసమ్మ, ఆఫీస్ సూపరింటెండెంట్ హరిశంకర్ తదితరులు అభినందించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


శ్రీనివాసులు(ఫైల్)

తుగ్గలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న జొన్నగిరి గ్రామానికి చెందిన రైతు చెట్నే పల్లి శ్రీనివాసులు(65) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తెలిపిన మేరకు.. మూడెకరాల సొంత పొలంతో పాటు నాలుగెకరాలు కౌలుకు తీసుకుని పూతగడ్డ, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ, కంది, సజ్జ పంటలను సాగు చేశారు. అయితే ఏటా నష్టాలు వచ్చి దాదాపు రూ.14లక్షల అప్పులయ్యాయి. వాటిని ఎలా తీర్చాలో తెలియక మదనప డుతూ ఉండేవాడు. మంగళశారం సాయంత్రం విషపు గుళికలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుత్తిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం అనంతపురం వైద్యశాలకు తరలించారు. కోలుకోలేక మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య మల్లేశ్వరమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు. టీడీపీ నాయకులు మిద్దె రవికుమార్, బాలన్న, నాగరాజు, బలరాముడు, సంగాల కృష్ణ కుటుంబ సభ్యు లను పరామర్శించారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని..

రైలు కిందపడి విద్యార్థి బలవన్మరణం


జగదీశ్వరరెడ్డి(ఫైల్)

నంద్యాల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలిం చడంతో బీ.టెక్ చదివే ఓ విద్యార్థి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నంద్యాల పట్టణంలో చోటుచేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ కుమారి తెలిపారు. వివరాలు.. నందికొట్కూరు మండలం తర్తూరు గ్రామానికి రమేశ్‌రె డ్డి, రాణి దంపతుల కుమారుడు జగదీశ్వ రరెడ్డి(17). తిరుపతిలోని విద్యానికేతన్ క ళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజుల క్రితం కళాశాలలో ఫీజు కట్టమని రూ.2.5లక్షలు తల్లిదండ్రులు ఇచ్చారు. అయితే జగదీశ్వరరెడ్డి ఆ డబ్బులు కట్టకుండా వాడుకున్నాడు. కళాశాల నుంచి ఫీజు కట్టా లని ఫోన్ వచ్చింది. దీంతో తల్లిదండ్రులు అతడిని మందలించారు. మనస్థాపం చెందిన విద్యార్థి మంగళవారం రాత్రి నంద్యాల రైల్వేస్టే షన్‌కు చేరుకున్నాడు. ప్లాట్‌ఫాం సమీపంలోనే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన వీరారెడ్డి(70) సోమవారం ఎమ్మి గనూరు నుంచి మల్కాపురం గ్రామానికి బైక్‌పై బయలుదేరి వెళ్లాడు. ఆదోని రోడ్డులోని శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ డిగ్రీ కళాశాల సమీపానికి వెళ్లగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో వీరారెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్య శాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

- మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న కర్ణాటక పోలీసులు


అర్జున్ (ఫైల్)

హొళగుంద, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమ్మాతాగేరి క్యాంప్ వద్ద ఎల్లెల్సీ కాల్వలో రెండు రోజులు క్రితం గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ దిలీప్‌కు మార్ తెలిపారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్ర బళ్లారి జిల్లా కంపి కొట్టాల నివాసి అర్జు న్(21). రెండు రోజుల క్రితం కనిపించ కుండా పోయినట్లు మృతుడు తండ్రి సుంకప్ప కురుగోడు పోలీస్‌స్టేషన్ ఫిర్యా దు చేశాడు. బళ్లారి పరిధిలోని సోమలా పురం గ్రామ సమీపంలో మంగళవారం ఎల్ఎల్‌సీ కాలువ గట్టుపై మృతుడికి సంబంధించిన బైక్‌ను కురుగోడు పోలీసులు కనుగొన్నారు. కాలువ వెంట పరిశీలించుకుంటూ వస్తుండగా బుధవారం మధ్యాహ్నం ఆంధ్రా సరిహద్దులోని సమ్మాతాగేరి క్యాంప్ వద్ద మృతదేహాన్ని కనుగొని, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని అర్జున్‌గా గుర్తించడంతో హొళగుండ ఎస్ఐ మిస్సింగ్ కేసు ఎఫ్ఐ ఆర్ వివరాల సమాచారమిచ్చి, మృతదేహాన్ని బళ్లారిలోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

వేధింపుల కేసులు నమోదు

మంత్రాలయం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ప్రాంతాలకు చెందిన భర్తలపై వేధింపుల కేసులు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్స్ లక్ష్మీనా రాయణ, రమణ తెలిపారు. వివరాలు.. చెట్నహళ్లి గ్రామానికి చెందిన ఏలిశమ్మను ఎమ్మిగ నూరు చెందిన మారెప్ప, లక్ష్మి కుమారుడు సుమలజాన్‌కు ఇచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం జరిపించారు. భర్త సుమలజాన్ రోజూ తాగి వచ్చి ఏలిశమ్మను హింసించడంతో పాటు అనుమానంతో వేధించేవాడు. దీనికి తోడు అత్త లక్ష్మి సైతం చిత్రహింసలు పెట్టేది. వారి బారి నుంచి తప్పించుకుని ఆమె చెట్నహళ్లి గ్రామానికి వచ్చింది. బుధవారం మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భర్త సుమలజాన్, అత్త లక్ష్మిలపై కేసు నమోదు చేశారు. అలాగే మంత్రాలయం రాఘవేంద్రపురం కాలనీకి చెందిన బెస్త గాయత్రీని కర్ణాటకలోని రాయచూరు తాలుకా ఈరాపురం గ్రామా నికి చెందిన వీరేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లి సమయంలో రూ.50వేల నగదు, తులం బంగా రు కట్నంగా ఇచ్చారు. భర్త వీరేష్ రోజూ తాగి వచ్చి చిత్రహింసలు పెడుతూ అనుమానంతో వేధిం చేవాడు. బాధితురాలు మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి కేసులో నిందితులు అరెస్టు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి కేసులో నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ అస్రర్ బాషా తెలిపారు. వివరాలు.. నంద్యాల పట్టణం నడిగ డ్డకు చెందిన హుస్సేని, సుభాన్ దేవనగర్‌కు చెందిన అల్తాఫ్ ముగ్గురు కలిసి ఫరూక్‌కు ఆటోను పండ్లతో సహా అద్దెకు ఇచ్చారు. వాటిని అమ్ముకొని రావాల్సి చెప్పారు. అయితే ఫరూక్ ఇవ్వకుండా వెళ్లాడు. అతడిని టెక్కె మార్కెట్ యార్డులోని గదిలో బంధించి దాడిచేశారు. దీనికి సంబంధించి వీడియో బయటకు వచ్చింది. సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీన్ని సుమోటాగా కేసు నమోదు చేసి కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే ఛేదించి నింది తులను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలిం చారు.

భార్యను చంపిన భర్తకు రిమాండు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో భార్యను చంపిన హత్య కేసులో భర్తకు బుధవారం రిమాండ్ విధించినట్లు టూ టౌన్ సీఐ అస్రర్ బాషా తెలిపారు. పట్టణంలోని ఎన్జీవో కాలనీకి చెందిన శిరీషా (45) అనే మహిళను భర్త సోమ నాథశర్మ అనే వ్యక్తి అనుమానంతో కత్తితో గొంతు కోసి చంపాడు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించి నట్లు సీఐ తెలిపారు.

కీలక మలుపు

- అటవీ శాఖ అవినీతి కేసులో పురోగతి
- కోర్టులో లొంగిపోయిన ప్రధాన నిందితుడు చాంద్‌బాషా
- రిమాండ్‌కు ఆదేశించిన న్యాయాధికారి


చాంద్‌బాషా(ఫైల్)

ఆత్మకూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోనే సంచలనంగా మారిన అటవీశాఖ సొమ్ము కాజేసిన కేసు కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రిటైర్డ్ అటవీ శాఖ ఉద్యోగి చాంద్ బాషా బుధవారం ఆత్మకూరు జూనియర్ సివిల్ కోర్టులో లొంగి పోగా మెజిస్ట్రేట్ రాహుల్ అంబే ద్కర్ ఆయనకు 14రోజుల పాటు రిమాండ్ విధించారు. దీంతో స్థానిక పోలీసులు ఆయన్ను నందికొ ట్కూరు సబ్ జైలుకు తరలించారు. కాగా ఆత్మకూరు అటవీ డివిజన్ కార్యాలయంలో సుమారు 15ఏళ్ల పాటు ఏవోగా పనిచేసి గత ఏడాది జూలైలో పదవీవిర మణ పొందిన ఏఎస్.చాంద్‌బాషా పని చేసిన సమయంలో అట వీశాఖకు చెందిన సొమ్మును తన సొంత అవసరాలకు దారిమ ళ్లించాడు. తొలుత రూ.19,25,993 విలువ గల రెండు చెక్కులను ఎఫ్‌డీపీటీ నంద్యాల చెందిన అకౌంట్‌కు పంపించాల్సి ఉండగా ఆ సొమ్మును తన బంధువుల పేర్లతో డ్రా చేసుకున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఈ ఏడాది ఏప్రిల్ 21న చాంద్ బాషాపై ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును దర్యాప్తు చేయగా జూలై 22వ తేది నాటికి రూ.4,37,65,501 అట వీశాఖ సొమ్మును స్వాహా చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆత ర్వాత కూడా విజిలెన్స్ కమిటీ విచారణ చేపట్టగా మరిన్ని అవక తవకలు వెలుగుచూశాయి. ప్రధాన నిందితుడైన చాంద్‌బాషా అటవీశాఖ చెక్కులను తన కుటుంబీకులతో పాటు నేతాజీనగర్ లోని మహేశ్వర ప్రింటర్స్ యజమాని వెంకట శివయ్య ద్వారా డ్రా చేయించి స్వాహా చేసినట్లు నిర్ధారిం చారు. ఈ క్రమం లోనే ఈ కేసులో ఏడుగురిని నిందితులుగా గుర్తించి అందులో ఐదుగురిని ఇప్పటికే అరెస్టు చేశారు.

హైకోర్టు ఉత్తర్వులతో..

హైకోర్టు ఉత్తర్వులతోనే రిటైర్డు అటవీ ఉద్యోగి చాంద్‌బాషా ఆత్మకూరు కోర్టులో లొంగిపోయారు. వాస్తవానికి అటవీ శాఖ సొమ్ము వ్యవహారంలో తొలుత రూ.19.25లక్షలు మాత్రమే అవి నీతి జరిగినట్లు అటవీశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన చాంద్ బాషా ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశాడు. అలాగే తాను వాడుకున్న రూ.19.25లక్ష లను తిరిగి చెల్లించానని, వయస్సు రీత్యా పోలీసులు తనను అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలని చాంద్‌బాషా హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో చాంద్‌బాషాను అరెస్టు చేయవద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ తర్వాత చాంద్ బాషా అక్రమాలు బట్టబయలు కావడంతో ఏకంగా రూ.4.37కోట్లు అవకతవకలు జరిగినట్లు తేలింది. దీంతో చాంద్ బాషా స్వాహా చేసింది రూ.19.25లక్షలు కాదని.. రూ.4.37కోట్లు అని తేలింది. ఇది పెద్ద కుట్ర అని పోలీసులు హైకోర్టులో కౌంటర్లు దాఖలు చేస్తూ వచ్చారు. అయితే హైకోర్టును తప్పు దోవ పట్టించేలా చాంద్‌బాషా వ్యవహరించడంతో ఆయన పిటి షన్‌ను తోసిపుచ్చి వారంలోగా ఆత్మకూరు కోర్టు (మదర్ కోర్టు)లో లొంగిపోవాలని హైకోర్టు వారు ఉత్తర్వులు జారీ చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఐదు నెలల తర్వాత చాంద్‌బాషా కోర్టులో లొంగిపోవాల్సి వచ్చింది.

స్థలం కోసం తహసీల్దార్‌పై దౌర్జన్యం


కోర్టు ఆర్డర్ చూపుతున్న తహసీల్దార్


వాదిస్తున్న ఆర్మీ ఉద్యోగి కుమార్తె పద్మ

బేతంచెర్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యాభై ఏళ్ల క్రితం స్థలాన్ని అమ్ముకొని వేరే ప్రాంతానికి వలస వెళ్లి ఇప్పుడు వచ్చి తమ స్థలం తమకే అప్పగించాలంటూ బుధవారం తహసీల్దార్ నాగమణిపై దౌర్జన్యం చేశారు. ఈ ఘటన పట్టణంలో చోటుచేసు కున్నది. స్థానికులు తెలిపిన వివరాలు.. రిటైర్డు ఆర్మీ ఉద్యోగి సానే శ్రీనివాసులు, ఆయన కుమార్తె పద్మ, కుటుంబ సభ్యులు గతంలో బేతంచెర్లలో నివాసం ఉండేవారు. 50 సంవత్సరాల క్రితం తమకున్న స్థలాన్ని అమ్ముకుని హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఇప్పుడు వచ్చి తమ స్థలాన్ని తమకు సర్వే చేయించి అప్పగించాలంటూ తహసీల్దార్‌పై దౌర్జన్యం చేస్తూ తమ స్థలం అప్పగించేంత వరకు ఇక్కడి నుంచి వెళ్లమని అన్నారు. అంతలో పోలీసులు వచ్చి వారి దౌర్జన్యాన్ని నివారించే ప్రయత్నం చేశారు. పద్మ మాట్లాడుతూ పోలీసులు తహసీల్దార్‌కు దాసోహం చేస్తున్నారే తప్ప తమకు న్యాయం చేయలేదని, తమకు న్యాయం జరిగేంత వరకు ఇక్కడే ఉంటామని అన్నారు. సర్వేయర్ స్థలం సర్వే చేయించకుండా తహసీల్దార్ నాగమణి అడ్డుపడ్డారని, ఆమెపై దాడికి పాల్పడటంతో పోలీసులు జోక్యం చేసుకుని వారిని కార్యాలయం నుంచి బయటికి తీసుకువచ్చారు.

వివరణ: ఈ విషయమై తహసీల్దార్ నాగమణిని వివరణ కోరగా తమకు ఆర్మీ ఉద్యోగి శ్రీనివాసులు స్థలం విషయంలో ఎలాంటి జోక్యం లేదని, గతంలోనే వారి స్థలాన్ని ఇతరులకు విక్రయించారని తెలిపారు. అయితే ప్రస్తుతం తన స్థలం తనకు కావాలని సర్వే చేయించి ఇవ్వాలని కుటుంబ సభ్యులంతా తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆమె తెలిపారు. స్థలానికి సంబంధించిన వ్యక్తి కోర్టు నుంచి స్టే ఆర్డర్ తీసుకుని వచ్చారని, కోర్టు అనుమతుల ప్రకారమే తాను ఫాలో అవుతున్నామని ఆమె తెలిపారు.

ఎమ్మెల్యే విరుపాక్షి దాతృత్వం

- చిగిలి బాధితులకు కుటుంబానికి రూ.50 వేల చొప్పున సాయం


బాధిత కుంటుంబాలకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆస్పరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని చిగిలి గ్రామంలో ఆగస్టు 20న చిన్నారులను కోల్పోయిన బాధిత తల్లిదండ్రులకు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆర్థిక సాయం చేశారు. బుధవారం గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించి, ఒక్కో కుటుం బానికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుం బాలను ఆదుకోవడం వైసీపీకే చెందుతుందన్నారు. బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. బాధిత కుంటుబాలను ఆదుకోవాలని పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బసవరాజు, గోవర్ధన్, రామాంజనేయులు, మహానంది, సర్పంచులు రాధాకృష్ణ, హరికృష్ణ, ప్రకాష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు


బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మహేశ్వర ప్రసాద్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరుగుతుందని, ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని రాష్ట్రీయ బాల ఆరోగ్య సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా మానసిక ఆరోగ్యస మస్యల బ్యానర్‌ను మానసిక వైద్యులు డా.చైతన్యతో కలిసి ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా మహేశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ ఏదైనా ఆత్మ హత్య చేసుకోవాలనే ఆలోచన అత్యంత ప్రమాదకరమన్నారు. దీని నుంచి బయట పడాలంటే మానసిక వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో మానసిక వైద్యులు డా.చైతన్య అవగాహన కల్పించారు. ఆత్మహత్యల నివారణకు టెలిమానస్ టోల్‌ఫ్రీ. నెంబర్.14416ను సంప్రదించి నిపుణుల ద్వారా ఉపశమనం పొందవ చ్చునన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డా.ఆర్.పద్మా వతి, డెమో శ్రీనివాసులశెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి, ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ, ప్రాజె క్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమల దేవి
- బాలికల పాఠశాల హెచ్ఎంకు షోకాజ్ నోటీసు

వెల్దుర్తి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిం చాలని ఫుడ్ కమిషన సభ్యురాలు గంజిమల దేవి సూచిం చారు. బుధవారం జ్యోతిబా పూలే పాఠశాలను అనిఖీ చేశారు. స్టోర్ రూం, స్టాక్ పాయింట్లను పరిశీలించి, విద్యార్థి నులతో మాట్లాడారు. ఉదయం టిఫిన్, రోజూ అరటి పండు ఇస్తున్నారా అని అడుగగా.. ఇవ్వడం లేదని విద్యార్థినులు తెలిపారు. దీంతో ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తంచేసి, మెనూ


భోజనాన్ని పరిశీలిస్తున్న గంజిమల దేవి

పాటించాలని సూచించారు. అంబేడ్కర్ గురుకులం, పట్టణం లోని బాలికల పాఠశాలను పరిశీలించారు. సరైన సమాధానం ఇవ్వని బాలికల పాఠశాల హెచ్ఎంకు నోటీసులు జారీ చేయాలని ఇన్‌చార్జి ఎంఈవోను ఆదేశించారు. ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించారు. తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, డీటీ గురుస్వామి రెడ్డి ఉన్నారు.

అనస్థీషియా టెక్నీషియన్ల పోస్టులను భర్తీ చేయాలి


డీఎం డాక్టర్ రఘునందన్‌ను అభినందిస్తున్న టెక్నీషియన్లు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న అనస్థీషియా టెక్నీషియన్ల పోస్టులను భర్తీ చేయాలని ఏపీ అనస్థీషియా టెక్నీషి యన్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డా.జి.రఘునందన్‌ను కోరింది. విజయవా డలో బుధవారం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.దినేష్ ఆధ్వ ర్యంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యు కేషన్‌ను కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని కొన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో తమకు ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్‌లు ఇవ్వడ లేదని రాష్ట్ర కార్యదర్శి దినేష్, డీఎంఈ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే జీతభత్యంలో వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. దీనిపై స్పందించిన డీఎంఈ తక్షణమే జూమ్ మీటింగులో సంబంధిత అధికారులతో మాట్లాడి విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అనస్థీషియా టెక్నీషియన్ల ఖాళబూ పోస్టులను భర్తీ చేస్తానని డీఎంఈ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశా ధికారి వినోద్, వైస్ సెక్రటరీ సురేష్, అమర్ పాల్గొన్నారు.

నేపాల్ నుంచి సురక్షితంగా...

- దాడులతో ఇబ్బందులు పడ్డ ఆదోని వాసులు
- మంత్రి నారా లోకేశ్ చొరవతో భారత్ చేరుకున్న వైనం


భారతదేశానికి చేరుకున్న పెండేకల్లు బసవరాజు, అనిత

ఆదోని, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విహార యాత్ర కోసం నేపాల్ వెళ్లగా.. అక్కడ జరుగుతున్న దాడుల్లో ఆదోని వాసులు చిక్కుకున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన 22 మంది దాకా నేపాల్‌లో ఉన్నారు. వారిలో పట్టణంలోని ఎస్కేడీ కాలనీకి చెందిన భార్యాభర్తలు పెండేకల్లు బసవరాజు, అనితలున్నారు. వీరిద్దరూ విహారయాత్ర కోసం నేపాల్ వెళ్లారు. వృత్తిరీత్యా పెండేకల్లు బసవరాజు గోల్డ్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరితోపాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన పది మంది వీరి బంధువులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. వీరందరినీ రక్షించేందుకు మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ చూపి అక్కడ ఉన్న వారిని భారతదేశానికి రప్పించేందుకు అన్ని చర్యలు చేపట్టారు. ఎస్కేడీ కాలనీకి చెందిన పెండేకల్లు బసవరాజు, అనిత దంపతులు భారతదేశానికి బుధవారం రాత్రి 10గంటల సమయంలో సురక్షితంగా చేరుకున్నారు. మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక ప్రయత్నాలతో వారిని సురక్షితంగా భారత్‌కు రప్పించారు. ఈవిషయం నారా లోకేశ్ కార్యా లయం నుంచి ఆదోని తెలుగు యువత నాయకులు మారుతినాయుడికి సమాచారం అందించారు. వెంటనే ఆయన వారి యోగక్షేమాలను తెలుసు కుంటూ ఫోన్‌లో వారితో మాట్లాడారు. అక్కడ చిక్కుకున్న మొత్తం 32 మంది వివిధ ప్రాంతాల వారు కూడా మంత్రి లోకేశ్ సాయంతో భారతదేశ సరిహద్దుకు చేరుకున్నారు. భారత్‌కు చేరుకున్న యాత్రికులు మంత్రి లోకేశ్, మారుతినాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

జమ్మలమడుగులో ఘోరం

- గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ
- 20 గొర్రెలతోపాటు ఇద్దరు కాపరులు మృతి
- మృతులు నంద్యాల జిల్లా రుద్రవరం వాసులు



మృతి చెందిన గొర్రెల కాపరులు

జమ్మలమడుగు/రుద్రవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్న వారి పాలిట ఓ లారీ మృత్యుశకంగా మారింది. బుధవారం తెల్లవారు జామున గొర్రెలమంద వెళ్తుండగా అతివేగంగా లారీ దూసుకు రావడంతో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెలను తోలుకెళుతున్న ఇద్దరు కాపారులు తీవ్రగాయాలపాలై మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన కడప జిల్లా జమ్మలమడుగు పట్టణ శివార్లలోని శ్రీసాయి శివానీ కల్యాణ మండపం సమీపాన బైపాస్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాల్లోకి వెళితే... నంద్యాల జిల్లా రుద్రవరం మండలానికి చెందిన గొర్రెల కాపరులు నెల రోజుల క్రితం గండికోట ప రిసర ప్రాంతాల్లో గొర్రెలను మేపుకునేందుకు వచ్చారు. బుధవారం తెల్ల వారుజామున తిరిగి వారి గ్రామాలకు వెళ్లేందుకు బయలు దేరారు. గొర్రె లను తోలుకుని జమ్మలమడుగు బైపాస్‌రోడ్డు గుండా వెళుతుండగా.. అదే సమయంలో తాడిపత్రి వైపు నుంచి అతివేగంతో వచ్చిన లారీ గొర్రెల మందపైకి దూసుకొచ్చింది. దీంతో 20 గొర్రెలు సంఘటనా స్థలంలో నుజ్జునుజ్జయి మృతిచెందాయి. గొర్రెలను తోలుకుని వెళుతున్న కాపరులు రుద్రవరం మండలం నల్లవాగుపల్లెకు చెందిన వరద చిన్నవెంకటేశ్వర్లు (45) రెండు కాళ్లు విరిగి తలకు గాయాలయ్యాయి. అలాగే ఆలమూరు గ్రామానికి చెందిన రాజుపాలెం లక్ష్మీనరసింహ (35) తీవ్రంగా గాయ పడ్డాడు. వీరిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా దారి లో వెంకటేశ్వర్లు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మీనరసింహ మృతిచెం దారు. గొర్రెల కాపరుల యజమాని వెనుక ఉండడం వలన ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ ఘటన జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్ బాబు, ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది అక్కడకు చేరుకొని పరిశీలించారు. ఈ విషయం బంధువులు, కుటుంబ సభ్యులకు తెలియడంతో జమ్మలమడు గు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్దకు చేరుకుని భోరున విలపించారు. కాగా, ప్రమాదానికి కారణమైన లారీ ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసతుల్లేక విద్యార్థుల అవస్థలు

● దోమల దాడి ● చాలీచాలని గదులు ● ప్రభుత్వ వసతి గృహాల్లో దుస్థితి ఇదీ..




నంద్యాల సాయిబాబానగర్‌లోని బీసీ కళాశాల బాలుర వసతిగృహంలో రేకుల షెడ్డుతో అవస్థలు .. శిథిలావస్థలో కిటికీలు, గోడలు

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతి గృహాల్లో వసతులు కరువై విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల దాడి, చాలీచాలని గదులతో కాలం వెళ్లదీస్తున్నారు. నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసమని పట్ట ణాలకు వచ్చారు. అద్దెలు కట్టలేక ప్రభుత్వం ఏర్పాటు చేసిన వసతిగృ హాల్లో ఉంటున్నారు. ఈ వసతి గృహాల్లో సరైన వసతుల్లేవు. దీంతో ఇటు చదువులు వదులు కోలేక అటు వసతులు కరవవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల విద్యార్థులకు సరిపడా గదులు, మరుగుదొడ్లు లేవు, మరికొన్ని చోట్ల మెనూ అమలు కావడం లేదు, కొన్ని హాస్టళ్ల శిథిలావస్థలో ఉండటంతో విద్యార్థులు భయం భయంగా కాలం వెళ్లదీస్తు న్నారు. ఇందుకు నంద్యాల బొమ్మల సత్రంలోని ఎస్సీ కళాశాల బాలుర నంబరు 1, నంబరు 2, సాయి బాబానగర్‌లోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతిగృహాలు నిదర్శనంగా నిలుస్తున్నా యి. గత వైసీపీ ప్రభుత్వంలో వసతి గృహాలను ఏ మాత్రం పట్టించుకోలేదని, ప్రస్తుతమున్న కూట మి ప్రభుత్వంలో తమ సమస్యలు తీరుతాయని పిల్లలు ఆశిస్తున్నారు.

దోమల బెడదతో తట్టుకోలేకున్నాం

ఎస్సీ కళాశాల బాలుర నంబరు 1, నంబరు 2 హాస్టళ్లలో దాదాపు 150 మంది విద్యార్థులు ఉన్నారు. గదికి 10 మంది చొప్పున ఉన్నారు. అయితే ఈ వసతిగృహానికి ఉన్న కిటికీల అద్దాలు మొత్తం పగిలిపోయాయి. దీంతో పర దాలు కట్టుకున్నారు. అయినా దోమలు అధికం గా వస్తున్నాయి. కొన్ని గదుల్లో ఫ్యాన్లు పని చేయడం లేదు. దీంతో దోమల బెడద అధికమై రాత్రి పూట నిద్రపోలేకపోతున్నామని విద్యార్థు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల బెడద తో రోగాలపాలవుతున్నట్లు వారు తెలి పారు. మరుగుదొడ్లు సైతం శుభ్రంగా ఉండటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల బాధలు తీర్చాలని కోరుతున్నారు.

రేకుల షెడ్డే గతి..

సాయిబాబానగర్‌లోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతిగృహంలో దాదాపు 80 మంది విద్యార్థులున్నారు. వీరికి సరిపడ గదులు లేకపోవడంతో హాస్టల్ వెనుకవైపునున్న రేకుల షెడ్డులో 12 మంది ఉంటున్నారు. వర్షం వస్తే వారికి అవస్థలు తప్పడం లేదు. అలాగే వసతి గృహంలోని ఓ గదిలో పైపెచ్చులూడాయి. కిటికీ లు ధ్వంసమయ్యాయి. నాలుగు మరుగు దొడ్లు మాత్రమే ఉన్నాయి. అందులో ఒకటి మర మ్మతులకు గురైంది.

నూతన భవనం నిర్మిస్తే సమస్యలుండవు

దేవనగర్‌లో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ బాలుర ప్రీమెట్రిక్ వసతిగృహ స్థలంలో నూతన భవన నిర్మాణానికి ప్రతి పాదనలు పంపాం. నూతన భవనం నిర్మిస్తే ఈ సమస్యలు ఉండవు. ప్రభుత్వం స్పం దించాలని కోరుతున్నా.

● వేణుగోపాల్, సంక్షేమాధికారి, బీసీ వెల్ఫేర్ కళాశాల బాలుర వసతి గృహం



బొమ్మలసత్రంలోని ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహంలో కిటికీలకు పరదాలు కట్టిన దృశ్యం



బీసీ కళాశాల బాలుర వసతిగృహంలో పెచ్చులూడి ఇలా..

ఈ క్రాప్‌ను త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి

పాణ్యం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ క్రాప్‌ను త్వరిత గతిన పూర్తి చేయాలని పాణ్యం తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల వ్యవసాయ అధికారులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి ఈ క్రాప్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో సుమారు 35 వేల ల్యాండ్ పార్శిల్స్ ఉన్నాయన్నారు. ల్యాండ్ పార్శిల్ నెంబర్లకు గ్రామ వ్యవ సాయ అధికారులు ఈ క్రాప్‌ను నమోదు చేయాల న్నారు. ఈక్రాప్ నమోదైన పార్శిళ్లకు వీఆర్ఓలు అటెస్టెడ్ చేసి పూర్తి చేయాలన్నారు. ఈక్రాప్ ప్రక్రియను గ్రామ అధికారులు 15 రోజుల లోపు పూర్తి చేయాలన్నారు. ఏ గ్రామంలోనైనా ఈ క్రాప్ సరిగా చేయని పక్షంలో గ్రామ అధికారులపై చర్యలు తప్పవన్నారు. గ్రా మాలలో ఈ క్రాప్ సమాచారాన్ని చాటింపు ద్వారా తెలిపి రైతులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు. వరదలు వచ్చిన ప్రాంతాలలో ఈక్రాప్ బుకింగ్ ద్వారానే పంటనష్టం అంచనా వే యాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాము, ఎంఏఓ జయప్రకాష్ రెడ్డి, వీఆర్వోలు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవ కమిటీ నియామకం



నూతన కార్యవర్గ సభ్యులు

మహానంది, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహానంది మం డల గణేశ్ కేంద్ర ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధ వారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మహానందిలో గణేష్ కమిటీ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో గణేశ్ కేంద్ర ఉత్సవ కమిటీ సల హాదారుడిగా చిన్న కాశయ్య, గౌరవాధ్యక్షుడిగా మహేష్, అధ్యక్షుడిగా సుబ్బరామయ్య, ప్రధాన కార్యదర్శిగా మురళి కోశాధికా రిగా నాగ రాజులతో పాటు మరో 20 మంది నూతన కమిటీ సభ్యు లను ఎన్నుకున్నారు. అలాగే మహానందీశ్వర పరిరక్షణ సమితి సభ్యులను కూడా ఎన్నుకున్నారు. ఇందులో గౌరవ సలహాదారుడిగా రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా తోట కిట్టు, అధ్యక్షుడిగా పన్నంగి రమణయ్య, కోశాధికారిగా సుబ్బరాయుడు, ప్రధాన కార్యనిర్వాక కార్యదర్శిగా శివతో పాటు మరో 20 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. మహానందీశ్వర పరిరక్షణ సమితి సభ్యులు భక్తుల సమస్యల ను దృష్టిలో పెట్టుకొని పోరాటాలు చేస్తామన్నారు.

జాబ్ మేళాలో 131మందికి ఉద్యోగాలు

నందికొట్కూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నంది కొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో 131 మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో 10 ప్రైవేట్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా 246 మంది అ భ్యర్థులు హాజరయ్యారు. ఇందులో 131 మంది అభ్యర్థుల ను ఆయా కంపెనీలు ఎంపిక చేసుకొని ఉద్యోగ అవకాశాలు కల్పిం చాయని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పాల్ రంగముణి, వైస్ ప్రిన్సిపాల్ రవి కుమార్ పాల్గొన్నారు.

తల్లి పాలతోనే రోగనిరోధక శక్తి



మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖర్

నందికొట్కూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లిపాల తోనే పిల్లల్లో రోగనిరోధక శక్తి లభిస్తుందని డాక్టర్ రాజశేఖర్ అన్నారు. ప్రపంచ రోగుల భద్రత దినోత్సవం సందర్భంగా నంది కొట్కూరు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నవజాత శిశు వులు, పిల్లల భద్రతపై కుటుంబ సభ్యులకు అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పిల్లలకు శిశువు గుర్తింపు ట్యాగ్‌లు, రోగనిరోధకత టీకాలు, షెడ్యూల్ ప్రకారం వేయించాలన్నారు. పిల్లలను తాకేటప్పుడు చేతులు పరిశు భ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా శిశువుకు తల్లి పాల ద్వారా మాత్రమే శక్తివంతమైన రోగనిరోధక శక్తి లభిస్తుం దన్నారు. పిల్లలు పాలు తాగకపోయినా వాంతులు, జ్వరం బారి నపడినా వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షేక్ జక్కి, డాక్టర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ జాయింట్-1గా శ్రీనివాసులు



శ్రీనివాసులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల సబ్ రిజి స్ట్రార్ జాయింట్-1గా శ్రీనివా సులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సత్య సాయి జిల్లా కదిరిలో సబ్ రిజి స్ట్రార్‌గా విధులు నిర్వహించి ఇక్కడకు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. కాగా ఈ పోస్టును 8 నెలల నుంచి ఇప్పుడు భర్తీ చేశారు.

దేశపురోగతికి ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ మార్గదర్శకత్వం కీలకం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): దేశపు రోగతికి ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ మార్గదర్శకత్వం కీలకం అని బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ రాధాకృష్ణన్ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని, ప్రధాని నరేంద్రమోదీ దూరదృష్టి, ఆత్మనిర్భర భారత్ లక్ష్యం సాధనలో ఉప రాష్ట్రపతి కీలక పాత్ర పోషిస్తారన్నారు. భారతదేశం అంతర్జాతీయ వేదికలపై మరింత గౌరవాన్ని సంపాదిస్తుందన్నారు. అలాగే దేశంలో ప్రతి వర్గానికి సమాన అవకాశాలు, అభివృద్ధి అందించే దిశగా ఉపరాష్ట్రపతి మార్గదర్శనం వెలకట్టలేనిది అవుతుందని అభి రుచి మధు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఏఐఎస్‌బీ మహాసభలను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అఖిలభారత విద్యార్థి బ్లాక్ 9వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని అధ్యక్షుడు పీవీ సుందరరామరాజు, రామినీ రాజునాయుడు పిలుపుని చ్చారు. బుధవారం నంద్యాల ప్రభుత్వ బాలుర వసతిగృహంలో ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు తెలు గు మహేష్ అధ్యక్షతన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 19 రాష్ట్రాల నుంచి 350 మంది ప్రతినిధులు ఈ మహా సభల్లో పాల్గొంటారన్నారు. కడపలో ఈనెల 12న విద్యార్థి ప్రదర్శన, బహిరంగ సభ జరగనున్నాయన్నారు. ఈ నెల 13, 14 తేదీల్లో రాష్ట్ర ప్రతినిధులతో జాతీయ మహాసభ జరుగుతుందన్నారు. జాతీయ స్థాయిలో విద్యావిధానంపై, విద్య, వైద్యం ప్రైవేటీకరణపై పలు తీర్మానాల రూపంలో కార్యాచరణ రూ పొందిస్తామన్నారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ స్థాపించిన అఖిలభారత విద్యార్థి బ్లాక్ మహాసభలు కడపలో జరుపుకోవడం సంతోషకరమన్నారు. అఖిలభారత యువజన లీగ్ రాష్ట్ర కన్వీనర్ పి.రవీంద్రనాథ్, ఫార్వర్డ్‌బ్లాక్ జిల్లా అధ్యక్షుడు వనం వెంకటాద్రి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై ఈఈ సమావేశం



మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ ఈఈ కృష్ణారెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు డివిజన్ పరిధిలో గృహ నిర్మాణ పథకానికి సంబంధించి ఇళ్ల నిర్మాణాలపై బుధవారం ఆ శాఖ ఈఈ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఎన్ని గృహాలు మంజూరయ్యాయి, ఏయే దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్న వివరాలను ఆరా తీశారు. డిసెంబరులోగా లబ్ధిదారులు గృహాలను త్వరగా నిర్మించుకు నేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవి ధంగా ఆయా దశల్లో పూర్తయిన నిర్మాణాలకు త్వరితగతిన బిల్లులు చెల్లించేలా సిబ్బంది చొరవ తీసుకోవాలని సూచిం చారు. ఈ సమావేశంలో డీఈ నాగరాజు, ఆయా మండలాల ఏఈలు, వర్క్ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో మం డ్లెం-నందికొట్కూరు మధ్యలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం మోటారు సైకిల్‌ను ఆల్విన్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాల య్యాయి. కేతవరం గ్రామానికి చెందిన శివశంకర్ నాయు డు తూడిచర్లకు వెళుతుండగా కర్నూలు నుంచి కృష్ణా జిల్లాకు వెళుతు న్న ఆల్విన్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు 108లో తరలించారు.

శ్రీశైల క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సాక్షి గణపతికి

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో లోక కల్యాణార్థం బుధవారం సాక్షి గణపతికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహిం చారు. సాక్షిగణపతికి పంచామృతాలతోనూ, పలు ఫలోదకాలతోనూ, హ రిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధ జలంతో అభిషేకం నిర్వహించారు. అనం తరం స్వామివారికి విశేష పుష్పార్చన, నివేదన కార్య క్రమాలు చేపట్టారు. అలాగే ఆలయానికి ఉత్తర భాగంగా మల్లికా గుం డానికి పక్కనే ఉన్న జ్వాలా వీరభద్రస్వామికి విశేష అభిషేకం నిర్వహించారు.

14న భారత్ వికాస్ పరిషత్ నంద్యాల శాఖ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న నూతన కమిటీ అధ్యక్షుడు ఆనంద్ గురూజీ

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని మున్సిపల్ పార్కు లో గల ఆయుష్ యోగా కేంద్రం నందు ఈనెల 14 వతేదీ ఉదయం 10 గంటలకు ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ అయిన భారత్ వికాస్ పరిషత్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఉంటుందని ప్రస్తుత ప్రెసిడెంట్ రామచం ద్రారెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నూతన కమిటీ అధ్యక్షుడిగా కండే ఆనంద్ గురూజీ, జనరల్ సెక్రటరీగా కూరాకు వీరాంజనేయప్రసాద్, ట్రెజరర్‌గా పాలూరు రాజా, సేవా ప్రము ఖ్‌గా వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్‌గా గోపాలకృష్ణను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, వీరితో పాటు భారత్ వికాస్ పరిషత్ తిరుపతి ప్రాంత అధ్యక్షుడు నిరంజన్‌బాబు, జనరల్ సెక్రటరీ శ్రీధర్‌పిళ్లే, ట్రెజరర్ వేణుగోపాల్ తదితరులు అతిథులుగా హాజరవుతారన్నారు. నూతన అధ్యక్షుడు ఆనంద్‌గురూజీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎన్నుకున్నం దుకు సంస్థకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతానన్నారు.

అమర వీరుల పోరాటం ఆదర్శం



అమర వీరుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అమర వీరుల పోరాటం ఆదర్శమని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ, విద్యుత్ పోరాటంలో అమరులైన సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేదల భూములను లా క్కోవడానికి ప్రయత్నించిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్య మాన్ని నడిపించిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. 2000 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ నందు జరిగిన విద్యుత్ ఉద్యమంలో ముందుండి అశువులు బాసిన పోరాట యోధుడు రామకృష్ణ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీరాములు, వెంకట సుబ్బయ్య, సుంకన్న, చిన్న నారాయణ, సుబ్బరాయుడు, రామ కృష్ణ, బుజ్జి, సీఐటీయు నాయకులు రామ్‌నాయక్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులతో నాణ్యమైన దిగుబడులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నానో ఎరు వుల వాడకం వల్ల భూమి కాలుష్యం తగ్గి నాణ్యమైన దిగు బడులు సా ధించవచ్చని మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావ్ తెలిపారు. బుధ వారం ఊడుమాల్పురం, పోలూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ఎరువులను మోతాదుకు మించి వాడరాదని సూచించారు. ఎకరాకు 96 కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం, 32 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువుల ను వాడాలన్నారు. ప్రతి రైతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను ఉపయోగించి సేద్యం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందొచ్చని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవల్లిక, ఆర్ఎస్‌కే సిబ్బంది సంజీవ్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు లావాదేవీల్లో అవకతవకలు లేకుండా చూడాలి: పీడీ



మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

పాణ్యం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పొదుపు లావా దేవీలలో అవకతవకలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. బుధవారం వెలుగు కా ర్యాలయంలో జిల్లా మండల సమాఖ్య అకౌంటెంట్‌ల శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మా ట్లాడుతూ ప్రతినెలా అకౌంటెంట్లు తప్పకుండా అన్ని రకాల పుస్తకాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. నెల చివరినాటికి జమా చెల్లింపుల నివేదికలు తయారు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా డబ్బు చెల్లింపు, లావాదేవీలలో అవక తవకలు జరగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లావాదేవీల రికార్డులకు సంబంధించిన రశీదులు తప్పకుండా ఉండేలా చూ సుకోవాలన్నారు. డీపీఎంబీ నాయక్, ఏరియా కో ఆర్డినేటర్ ప్రసాద్, ఏపీఎంబీ పుణ్యవతి పాల్గొన్నారు.

పనుల నాణ్యతలో రాజీ వద్దు: డీఈ



రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈ వీరన్న

కొత్తపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం నుంచి జానాల గూడెం వరకు చేప డుతున్న బీటీ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నందికొట్కూరు డివిజన్ పీఆర్ డీఈ వీరన్న కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బుధవారం ఆయన సంగమేశ్వరం నుంచి జానాల గూడెం వరకు కేంద్ర ప్రభుత్వ రూ.4 కోట్ల నిధు లతో చేపడుతున్న నిర్మాణ పనులను ఏఈ రమణ, కాంట్రాక్టర్ మద్దయ్యతో కలిసి డీఈ రమణ పరిశీలించారు. అనంతరం డీఈ మాట్లాడుతూ బీటీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగు తున్నాయని, పనులు వేగవంతం చేయాల న్నారు. ఇప్పటి వరకు సంగమేశ్వరం నుంచి జానాల గూడెం వరకు పూర్తి స్థాయిలో కంకర వేసి రోలింగ్ చేశారన్నారు. త్వరలోనే బీటీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా కొండను కొలిచి రోడ్డు మార్గాన్ని వెడల్పు చేశామన్నారు. 7.2 కిలోమీటర్ల మేర చేపడుతున్న రహదారిలో 20 కల్వర్టులు పూర్తి చేశామని, ఇంకా నాలుగు కల్వర్టులు నిర్మించాల్సి ఉందన్నారు. అలాగే దుద్యాల-కొక్కెరంచ బీటీ రోడ్డు, సంగమేశ్వరం ప్రధాన రహదారి నుంచి చిన్నగుమ్మడాపురం వరకు సీసీ రోడ్డు వచ్చే నెలలో ప్రారంభి స్తామని డీఈ వివరించారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న నాగరాజు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించు కోవాలని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు యేసురత్నం, నాగ రాజు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో వా రు మాట్లాడు తూ విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలని కోరారు. ఇప్పటికే 50 శాతం పైగా వైద్యం, విద్య ప్రవేట్‌పరం అయిందని, పేద విద్యార్థులకు అందనంత దూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని మార్చుకోకపోతే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ఆలయ చైర్మన్ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న ఆలయ చైర్మన్ నారాయణరెడ్డి, కమిటీ సభ్యులు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథ స్వామి దేవాలయం చైర్మ న్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు, తరిగోపుల గ్రామానికి చెందిన నారాయణరెడ్డి బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. జిల్లా ఆల య తనిఖీ అధికారి హరిచంద్రారెడ్డి, ఈవో సాయి కుమార్ ఆధ్వ ర్యంలో చైర్మన్‌తో పాటు, 8మంది కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వారిని ఆలయ మర్యాదలతో శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు దొర బాబురెడ్డి, నాయకులు రమణారెడ్డి, నాగార్జునరెడ్డి, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రణభేరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జి ల్లాలో ఈనెల 15నుంచి 19 వరకు యూటీఎఫ్ రణభేరి, ప్రచార భేరి బైక్‌జాతా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్ తెలిపారు. బుధవారం నంద్యాల యూటీఎఫ్ కార్యాల యంలో రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్ర మాలు రద్దుచేసి బోధనకే పరిమితం చేయాలన్నారు. అస్తవ్యస్తం గా పునర్వ్యస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిదిద్దాలన్నారు. పేరుకుపోయిన రూ.వేలకోట్ల ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 4డీఏలు మంజూరు చే యాలని, 12వ పీఆర్సీని ప్రకటించాలన్నారు. అంతవరకు 29 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. రణభేరి ఈ నెల 15న కర్నూలు జిల్లాలో ప్రారంభమై అనంతపురం, సత్యసాయి, అన్న మయ్య, కడప, ఆళ్లగడ్డ, నంద్యాల, బనగానపల్లె, డోన్‌లో ముగు స్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాక పోతే ఈనెల 25న విజయ వాడలో బహిరంగ సభ నిర్వహి స్తామన్నారు. జనవిజ్ఞానవేదిక ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా కార్యదర్శులు అరవింద్, నరసింహారెడ్డి, రామదాసు, సోమన్న, ప్రేమకాంత్, రాంనాయక్, బాలస్వామి పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

దొర్నిపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డిప్యూటీ డీఈవో శంకర్‌ప్రసాద్ సూచించారు. బుధవారం డబ్ల్యూకొత్తపల్లె, దొర్నిపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. అనంతరం అదనపు తరగతుల నిర్వహణ, ఎఫ్‌ఏ-1 పరీక్షల్లో విద్యార్థుల మార్కులను ఆరా తీశారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మనోహర్‌రెడ్డి, రామచంద్రయ్య, ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి, దస్తగిరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన



పట్టణంలో జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బేతంచెర్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. బుధవారం పాఠశాల నుంచి పాతబస్టాండు మీదుగా సత్రం వరకు వందమీటర్ల పొడవు గల భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం సురేష్, ఆర్‌ఐ కోటయ్య చౌదరి మాట్లాడుతూ పాఠశాల కరికులంలో భాగంగా జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించామన్నారు. అలాగే విద్యార్థులకు భిన్నత్వంలో ఏకత్వం గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వాసవి, డీన్ శేషాద్రి, ఏవో శివ సుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలి

- కేజీబీవీల జిల్లా పరిశీలకుడు రాముడు

ప్యాపిలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో విద్యాప్రమాణాలను మెరుగు పరచాలని కేజీబీవీల జిల్లా పరిశీలకుడు రాముడు అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థునులతో మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశ్వరనాయక్, ప్రిన్సిపాల్ ప్రియాంక, సీఆర్పీలు రామాంజినేయులు, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగు లాభదాయకం

చాగలమర్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల సాగు లాభదాయకమని కోవెలకుంట్ల క్లస్టర్ పరిధి ఏపీడీ సాంబశివరావు అన్నారు. బుధవారం చాగలమర్రి ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్‌ఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 1200 ఎకరాల పండ్ల తోటల సాగు చేయాలన్న లక్ష్యమన్నారు. చాగలమర్రి మండలంలో 110 ఎకరాలకు గాను 70 ఎకరాల దాక గుర్తించారన్నారు. రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రషీద్‌ఖాన్, ఏపీవో ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

మండలంలో కుండపోత వర్షం

- రహదారులు జలమయం

చాగలమర్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు, పెద్దబోధనం, చిన్నబోధనం, ముత్యాలపాడు, శెట్టివీడు తదితర గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. రహదారులు, పలు వీధులు జలమయమయ్యాయి. ముత్యాలపాడు ఎస్సీకాలనీ రహదారిలో వర్షపు నీరు ప్రవహించడంతో కాలనీవాసులు రాకపోక లకు ఇబ్బందులు పడ్డారు. వారం రోజుల నుంచి వేసవిని తలపించేలా ఎండవేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. వాడుముఖం పట్టిన పంటలకు జీవం పోసింది.

ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన

చాగలమర్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా, డీఏపీ వాడటం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో రంగ నేతాజీ తెలిపారు. బుధవారం మండలంలోని మద్దూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నానోయూరియా, డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ కల్యాణ్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సాల్మన్

సంజామల, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపీడీవో సాల్మన్ సూచించారు. బుధవారం మండ ల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ అనిల్ కుమార్‌తో కలిసి మండల అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్‌ఐ రమణయ్య, వీఆర్‌వోలు, ఎరుకలయ్య, గుర్రప్ప, చిన్నయ్య, సుబ్బరాయుడు, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు వెంకట నారాయణ, శివ విక్రమ్, లక్ష్మణ్, రాంబాబు, సర్వేయర్లు పాల్గొన్నారు.

బ్యాటరీలు చోరీ.. కేసు నమోదు

రుద్రవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామానికి చెందిన రాచగుండ్ల భాస్కర్, రాముడు, విశ్వనాథ్‌ల మూడు ట్రాక్టర్లకు చెందిన బ్యాటరీలు, టేప్‌రికార్డులు చోరీకి గురైనట్లు ఎస్‌ఐ మహ్మద్‌రఫీ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చిన్నారులకు వైద్యపరీక్షలు

రుద్రవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ బాలల ఆరోగ్యంలో భాగంగా బుధవారం ఆలమూరు అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి అమర్‌నాథ్‌రెడ్డి చిన్నారులకు వైద్యపరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. 16 సంవత్సరాలు వచ్చే వరకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చెత్తతో సంపద సృష్టించాలి

రుద్రవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చెత్తతో సంపద సృష్టించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రమణ్యం అన్నారు. బుధవారం మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త సంపదతో పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పాములేటి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నానో యూరియాతో లాభాలు

రుద్రవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నానో యూరియాతో లాభాలు పొందవచ్చని ఏవో సుమతి అన్నారు. బుధవారం మండలంలోని దక్షిణకొట్టాల గ్రామంలో నర్సిరెడ్డి పొలంలో డ్రోన్ సాయంతో పిచికారి చేయించారు. నానో యూరియా పిచికారితో పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుందన్నారు. ఈ గ్రామంలో డ్రోన్‌తో ప్రయోగాత్మకంగా పిచికారి చేయించామన్నారు.

ఉష్ణం.. జనం ఉక్కిరిబిక్కిరి

- 36 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు
- వేసవిని తలపిస్తున్న ఎండలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సెప్టెంబరు రెండో వారంలోనూ వాతావరణం వేసవిని తలపిస్తోంది. వానా కాలంలో సైతం ఎండలు వెంటాడుతున్నాయి. నాలుగైదు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. మంగళ, బుధ వారాల్లో మండలంతో పాటు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో 36 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం తో వాతావరణం వేసవిని తలపించే విధంగా మారింది. కొద్ది రోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలతో చల్లబడిన వాతావరణం తిరిగి ఒక్కసారిగా పెరుగుతుండటంతో ప్రజ లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కొలిమిగుండ్ల మండల కేంద్రంలో మధ్యాహ్న సమయంలో బయటికి రావడానికి కూడా ఆసక్తి చూపడంలేదు. మరోవైపు ఆర్టీసీ బస్సుల్లో కూడా ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయింది. ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూలు మూడు జిల్లాల సరిహద్దులో ఉన్న కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు ఎండ వేడిమిని తట్టుకోలేక నిర్మానుష్యంగా కనిపించింది. ఉన్న ప్రయాణికులు చెట్ల నీడను ఆశ్రయించారు. మొత్తం మీద వారం రోజులుగా రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వివిధ వర్గాల ప్రజలను, రైతులను బెంబేలెత్తిస్తున్నాయి.



ప్రయాణికులు లేక నిర్మానుష్యంగా ఆర్టీసీ బస్టాండు

నాణ్యత పాటించకుంటే చర్యలు

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా నోడల్ అధికారి ఉమామహేశ్వరి



రికార్డులను పరిశీలిస్తున్న ఉమామహేశ్వరి

ఆళ్లగడ్డ, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): వంట సరుకుల్లో నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ నోడల్ అధికారి ఉమామహేశ్వరీ హెచ్చరించారు. బుధవారం ఆళ్లగడ్డలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బాలసదనాన్ని జిల్లా ఇన్‌చార్జి బాలల సంరక్షణ విభాగం అధికారి శ్రీనివాస్‌తో కలిసి ఆమె తనిఖీ చేశారు. బాలసదనంలోని పలు రికార్డులను, చిల్డ్రన్ హోం ను పరిశీలించారు. అలాగే వంట సరుకుల నాణ్యతను పరిశీలించారు. పలు విషయాలను పిల్లలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయి నిరాధారణకు గురైన ఆరు నుంచి 11 సంవత్సరాల మధ్య గల బాలికలు బాల సదనంలో ప్రవేశానికి అర్హులన్నారు. జిల్లాలో ఇలాంటి బాలికలు ఎవరైన ఉంటే 1098 కి ఫోన్ చేసి వారి వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో భారతి, సరస్వతి, హరిలక్ష్మి వేదవతి పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మద్దిలేటి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులందరికీ యూరియా సరఫరా చేస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నకొప్పెర్ల, బిజినవేముల రైతు సేవా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా అవసరం ఉన్న రైతులు మాత్రమే తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రైతులు జొన్న, మినుము, శెనగ పంట సాగు చేసేవారు విత్తనానికి ముందు యూరియాను వాడరాదన్నారు. యూరియా 48గంటల వరకు మాత్రమే ఉంటుందన్నారు. ఆ తరువాత ఆవిరి అవుతుందన్నారు. రైతులు ఎక్కువగా యూరియా తీసుకుని దాచుకోవడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. నానో యూరియా నానో డీఏపీ ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఖరీఫ్ పంటల వివరాల నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ సుధాకర్, సాంకేతిక వ్యవసాయాధికారి బాషా, మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి, బిజినవేముల టీడీపీ నాయకులు గజ్జల హుసేనయ్య, వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడి, చిన్నకొప్పెర్ల మాజీ సర్పంచ్ బుచ్చన్న, పెద్ద కొప్పెర్ల టీడీపీ నాయకులు శివశంకరరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు మనోజ్‌కుమార్, భరణి, రైతులు పాల్గొన్నారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి శరత్‌చంద్ర

బనగానపల్లె, సెప్టెంబరు 10, (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక యుగంలో పలువురు యువతీ యువకులు క్షణికావేశానికి లోనై ఆత్మహత్యలు చేసుకుంటూ జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారంటూ ప్రభుత్వ ఏరియా వైద్యశాల మానసిక వైద్యుడు శరత్‌చంద్ర అన్నారు. బుధవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా పట్టణంలోని కంకరగుర్రెడ్డి కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి 40 సెకండ్లకు ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇందుకు చిన్నచిన్న విషయాలే ప్రధాన కారణమన్నారు. సమస్యలను పరిష్కరించుకోవటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. విద్యార్థులతో ఆత్మహత్య చేసుకోమని ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ సదాశివమూర్తి మాట్లాడుతూ కాలం శక్తివంతమైందన్నారు. ఓర్పుతో సమస్యను పరిష్కారం చేసుకోవాలన్నారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ సోషల్ వర్కర్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్య సేవలపై టెలి మానస్ టోల్‌ఫ్రీ నంబరు 14416 నంబరుకు ఫోన్ చేస్తే 24 గంటలు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు ఎదుర్కొన్నప్పుడే ..

కోవెలకుంట్ల: సమస్యలను ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే విజయం సాధిస్తారని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీకళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాలలో తెలుగు విభాగాధిపతి కృష్ణశశాంక ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు నాగేశ్వర్‌రెడ్డి, కృష్ణదాస్, నరేంద్రనాథ్‌రెడ్డి, చంటిరెడ్డి, లక్ష్మిదేవి, అన్నపూర్ణ రమణారెడ్డి పాల్గొన్నారు.

కాచిన నీటిని తాగాలి



రంగాపురంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

బేతంచెర్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాచిన నీటిని తాగాలని జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్‌రావు సూచించారు. ఆర్‌ఎస్ రంగాపురం ఎస్సీ కాలనీలో విష జ్వరాలు ప్రబలడంతో బుధవారం జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్‌రావు, సహాయ మలేరియా అధికారి డాక్టర్ సత్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యాధికారి అబ్దుల్ ఆలీ కాలనీలో పర్యటించారు. కాలువల్లో అబిట్ ద్రావణం పిచికారి చేయించారు. నీరు నిల్వ ఉన్న తొట్లలో దోమ లార్వాల నీటిని పారబోయించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. రోగులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు రామాంజనేయులు, విజయకుమార్, ఏఎన్‌ఎం సుగుణ, ఆశా కార్యకర్తలు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

డోన్ రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్ రావు సూచించారు. బుధవారం మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో పర్యటించారు. జ్వరపీడితులకు వైద్యపరీక్షలు చేయించి మందులు అందజేశారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నమల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యాధికారి చెన్నకేశవులతో సమావేశమై జ్వరాలు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ సూర్యప్రతాప్, సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి రాజశేఖర్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

భయబ్రాంతులకు గురిచేయొద్దు



కొత్తపల్లెలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

దొర్నిపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జ్వరాలతో వచ్చే రోగులను భయబ్రాంతులకు గురి చేస్తే చర్యలు తప్పవని వైద్యాధికారి ఉసేన్ అన్నారు. బుధవారం కొత్తపల్లెలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దొర్నిపాడులోని ఓ ప్రైవేటు క్లినిక్‌లో రోగికి వైద్యపరీక్షలు చేసి డెంగీ సోకిందని రిపోర్టులు ఇచ్చారని తమ దృష్టికి వచ్చిందన్నారు. దాంతో వైద్య సిబ్బంది అక్కడికి వెళ్లి ప్రైవేటు డాక్టర్ ఇచ్చిన నివేదికను పరీక్షించగా కేవలం తెల్లపేపర్‌లో డెంగీ పాజిటివ్ వచ్చినట్లు రాసిచ్చారనానరు. అనంతరం అదే రోగికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త నమూనాలు సేకరించి పరీక్షిస్తే నెగిటివ్ అని తేలిందని అన్నారు. మండలంలో డెంగీ జ్వరాలు ఎక్కడా లేవని అన్నారు. ప్రజలు జ్వరాల బారీన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరికైన దగ్గు, జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

అవుకు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అవుకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీరాములు బుధవారం తెలిపారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందన్నారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలని తెలిపారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి గురుస్వాముల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ప్రముఖ వక్తలు ఆధ్యాత్మిక బోధనలు చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రహదారులు, పొలాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠినచర్యలు చేపడతామని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మద్యం ప్రియులు ఇష్టానుసారంగా వ్యవహరించి, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదని సూచించారు.

గర్భిణికి విద్యార్థి రక్తదానం

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రక్తహీనతతో బాధప డుతున్న గర్భిణికి ఓ విద్యార్థి రక్తదానం చేశారు. పట్టణానికి చెందిన లక్ష్మీదేవి అనే గర్భిణికి రక్తం అవసరం కావడంతో అనంత కళాశాల విద్యార్థి ఇంద్రకుమార్ స్థానిక వెంకటసుబ్బారెడ్డి ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల అధినేత అనంత రామ సుబ్బారెడ్డి, ఛైర్మన్ అనంత విజయలక్ష్మి అభినందించారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థి

సమాచారం ఇవ్వాలి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలవాసులు నేపాల్ దేశంలో చిక్కుకొని ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నేపాల్‌లో జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో ఇక్కడివాళ్లు ఎవరైనా ఉంటే వివరాలు తెలియజేయాలన్నారు.

రూ. 116 కోట్లతో వసతి గృహాల అభివృద్ధి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వసతి గృహాల అభివృద్ధికి రూ. 116 కోట్లు ఖర్చు చేసినట్లు పీఆర్ ఈఈ నాగరాజు తెలిపారు. బుధవారం ఉయ్యాలవాడలోని బాలువ వసతి గృహాన్ని, సీసీ రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొర్నిపాడు, చాగలమర్రి, యర్రగుంట్ల, ఉయ్యాలవాడ ఎస్సీ వసతి గృహాల్లో కాంపౌండ్, ఫ్లోరింగ్, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. జిల్లాలో 1026 సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు 980 రోడ్ల నిర్మాణాలను పూర్తి చేశామన్నారు.

బిల్లులు మంజూరు చేయండి

సీసీ రోడ్ల నిర్మాణ బిల్లులు మంజూరు చేయాలని కాంట్రాక్టర్లు రమేష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ఈఈని కోరారు. ఇప్పటి వరకు కేవలం 30 శాతం మాత్రమే బిల్లులు మంజూరు అయ్యాయన్నారు. ఇంకా 70శాతం బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఈఈ తెలిపారు.

మ్యాజిక్ డ్రైన్‌లతో నిధులు ఆదా : ఏపీడీ

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మ్యాజిక్ డ్రైన్‌లతో నిధులు ఆదా అవుతాయని ఉపాధి ఏపీడీ సాంబశివరావు తెలిపారు. బుధవారం కొండుపల్లె గ్రామంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావుతో కలిసి మ్యాజిక్ డ్రైన్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందమీటర్ల పొడవు గల మురుగు కాలువ నిర్మించాలంటే దాదాపుగా రూ. 4 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. అదే మ్యాజిక్ డ్రైన్ నిర్మాణానికి కేవలం 25 శాతం మాత్రమే ఖర్చు అవుతాయన్నారు. రెండు అడుగుల లోతు తవ్వి అందులో కంకర, చిప్స్ వేసి ఇంకుడు గుంతలాగ ఏర్పాటు చేస్తే ఎక్కడి నీళ్లు అక్కడ భూమిలోకి ఇంకిపోతాయన్నారు. దీని వల్ల భూగర్భ జలాలు కూడా పెరుగుతాయన్నారు. క్లస్టర్ పరిధిలో కొండుపల్లె గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా మొదలు పెట్టామన్నారు. కార్యక్రమం లో ఏపీవో హరిక్రిష్ణ, టీఏ, ఎఫ్‌ఏ ఉన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- రజక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఈశ్వరయ్య

డోన్ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డోన్ రజక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. బుధవారం కొండపేటలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతూ తీర్మానం చేసి ఆమోదింపజేయాలన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌పై ఈ నెల 13న కర్నూలులోని బీసీ భవన్‌లో జరిగే రాయలసీమ సదస్సుకు రజకులు తరలిరావాలని కోరారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

డోన్ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. డోన్ పట్టణ, మండల ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా ఆధార్ కార్డు జోడించి అర్జీలు ఇవ్వాలని కోరారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

చాగలమర్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర నూర్‌బాష దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటుపై చాగలమర్రి దూదెకుల సంఘం అధ్యక్షుడు టైలర్‌బాష హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ డైరెక్టర్లుగా బనగానపల్లెకు చెందిన ఖాసీం సాహేబ్, నంద్యాలకు చెందిన దూదెకుల దస్తగిరిని ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. నూర్‌బాష దూదెకుల సంఘం అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

చాగలమర్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్వామిత్ర సర్వే వేగవంతం చేయాలని శెట్టివీడు కార్యదర్శి ఆదినారాయణ సూచించారు. బుధవారం గ్రామంలో ఇంజనీరింగ్ సహాయకులుతో కలిసి ఇంటింటికి వెళ్లి కొలతలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కుటుంబ వివరాలు, హద్దులు నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో స్వామిత్ర సర్వే పకడ్బందీగా కొనసాగుతున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి బుధవారం వెల్లడించారు. సిబ్బందిని సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 15లోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

లోతట్టు వంతెన మరమ్మతులకు నిధులు

చాగలమర్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్ఞానాపురం గ్రామానికి వెళ్లే రోడ్డులోని లోతట్టు వంతెన మరమ్మతులకు రూ.10 లక్షలు నిధులు కేటాయించినట్లు పీఆర్ ఏఈ కొండారెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పీఎంఏవై పథకం కింద చిన్నబోదనం, మల్లేవేముల గ్రామాలలో ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేసేందుకు నిధులు మంజూరైనట్లు తెలిపారు.

పిల్లర్లకే పరిమితం



జలదుర్గంలో అసంపూర్తిగా నిలిచిన సచివాలయ భవనం

ప్యాపిలి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన సచివాలయ భవనాలు పునాదులకే పరితమయ్యాయి. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా భవనాలు పూర్తికాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలానికి 23 సచివాలయ భవనాలు మంజూరయ్యాయి. రెండు విడతలో ప్రారంభించిన 11భవనాలు వివిధ దశల్లో అర్థాంతరంగా నిలిచిపోయాయి. కొన్ని గ్రామాల్లో స్లాబ్‌వరకు పూర్తి కాగా, మరికొన్ని పునాదులకే పరిమితయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేసి అర్థాంతరంగా నిలిచిపోయిన భవనాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మూగజీవాలకు రోడ్డే ఆవాసం



రోడ్డుపై సేదతీరుతున్న ఆవులు

చాగలమర్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ప్రధాన రహదారి గాంధీబజార్ ఒకటి. పాతబస్టాండు నుంచి పెద్దమకానం వరకు ఈ రోడ్డులో నిత్యం ఆవులు, కుక్కలు గుంపులుగా తిరుగుతూ బాటసారులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రోడ్డుపైనే నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. వీటి యజమానులు రోడ్లపై విడిచి పెడుతున్న పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో రోడ్డుపైనే సేద తీరుతున్నాయి. ఒక్కో సమయంలో వాహనదారులపై దాడి చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు పశువులను, కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వ్యాపారులు కోరుతు న్నారు.